6-9-85 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

మినీకథ

# పండుగ


డాక్టర్ జయా నాగరాజు


వేగంగా వెళ్ళుతున్న కారు పైడిపాలెం వద్ద జనాన్ని చూచి వేగం తగ్గించాల్సి వచ్చింది... ''సార్...సార్'' అంటూ యువకులు కారు చుట్టు ముట్టారు.. చీమిడి కార్చుకుంటూ బొందులేక క్రిందకు జారుతున్న మాసిపేలిక లైన చెడ్డీని పైకి లాగుకుంటూ, తైల సంస్కారం లేక చింపిరిగా వున్న రాగి జుట్టును కండ్ల మీద పడకుండా పైకెగదోసుకుంటూ ఓ పది మంది పిల్లలు కారు చుట్టూ మూగి కారును మెల్లిగా ముట్టుకుంటూ

డ్రైవరు గసురుతున్నా వినక తమ ప్రతిబింబాలను కారు తళుకులలో చూచుకుంటూ ఆ కారులో కూర్చుంటే ఎలాగుంటుందో... అది ''రయ్యి'' మని పోతుంటే.. అబ్బో.. అని ఊహాగానం చేస్తూ గోలగా అరుస్తున్నారు...... గడ్డి ఎత్తుకు పోతున్న ఒకరిద్దరు ఆడవాళ్ళు ......ఎద్దులను తోలుకుపోతూ చోద్యం చూస్తున్న వృద్ధులు కొందరు.. అలా అలా కారుకు దూరంగా వుండి చుట్ట కాల్చుకుంటూ.. మధ్య మధ్యన తుపుక్కున ఉమ్ముతూ చూస్తున్నారు. ......అప్పుడప్పుడే చీకటి పడుతోంది.. కొన్ని పూరి గుడిసెల నుండి పొగ పైకెగసి అనంతంలో కలసి పోతున్నది.. గుడ్డి దీపాలు ఒకటి అర అక్కడక్కడ మిణుకు..మిణుకు మంటు న్నాయి......అలా జీర్ణావస్థలో వున్న పల్లె అది...... ఎవ్వరి అభిమానానికీ నోచుకోని లక్షలాది పల్లెలలో ఒకటి... ...

... ''ఏమిటి?'' అని అడిగాను ఎప్పుడూ లేని అలజడిని చూచి.. ''పండగ బాబయ్యా...'' అన్నారు ఉమ్మడిగా.. ఓ చొట్టలు పడ్డ డబ్బాను కారులోకి తోస్తూ ... ''పైడమ్మ పండుగ ... తొమ్మిది రోజులు చేసుకుంటాం... ఆ తల్లి చల్లని చూపువుంటే రోగాలు రొష్టులు రావు దొర .. గుడి కాడ పందిరేసి తొమ్మిది రోజులు సంబరం చేస్తాము.. పండగ వేషాలు వేస్తాము.. పోతును కోస్తాము...'' అని ఎంతో సంబరపడి ఆ గుంపులోని నడివయస్కుడు చెప్పుకుపోతున్నాడు... ''చందాదొరా'' అన్నాడు ఆ డబ్బా ఆసామి ... మరి లాభం లేదనుకొని.. తర తరాలుగా వీరిలో పాతుకుపోయిన నమ్మకాలకు నవ్వు కుంటూ.. ఓ పది రూపాయలు చందా డబ్బాలో వేశాను.. జనం దారి వదిలారు ... నా కారు ముందుకు దూసుకుపోయింది దుమ్ములేపుకుంటూ ... ... ... ''ఈ రోడ్డు మీద వచ్చే ప్రతికారు.. బస్సు..లారీని యిలానే ఆపేసి డబ్బులు దండుకొని పండగ చేసుకుం టారు బాబు. బాగా తప్పతాగుతారు.. కోసిన పోతు మాంసం.. ప్రతీ యిల్లూ పంచుకుంటుంది...'' అని చెప్పుకుపోతున్నాడు డ్రైవర్ ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...

చెట్టు క్రింది పైడమ్మ గుడికి వెల్లవేశారు.. గుడి ముందర తాటాకు పందిరి వేసి కాగితాల జండాలు కట్టారు... రోడ్డు మీది స్తంభం నుంచి ''కరెంట్టం'' లాగి పందిరి నలంకరించారు.. కొన్ని పాత తీగెలతో.. ఇలా చేయడానికి వారికి ఏ ప్రభుత్వం అనుమతీ అవసరం లేదు... చాలా మట్టుకు సినిమాలు వేయడానికే ఒప్పందం జరిగింది. ''భక్తి సినిమాలు వేయం ఉత్త్ర..'' అని వృద్ధులంటే.. ''ఛ..ఛ'' అని కుర్రకారు అన్నారు.. ఏదో లాంఛన ప్రాయంగా ఓ రోజు ''ఎన్.టి.యార్'' గారి ''పాండవ వనవాసం'' వేయడానికి నిర్ణయమయ్యింది. మిగతా రోజులు 'జ్యోతిలక్ష్మి' 'సిల్కుస్మిత' వగైరా నగ్న నృత్యాలు చేసిన వాటిని ... ''గజ దొంగ''.. ''దొంగల్లో దొంగ''.. ''కిల్లాడి దొంగ'' .. ''మదనలీలలు''.. యిలాంటివే అన్నీ ఎన్నిక లైనాయి. ఒకొక్క సినిమాకు నాలుగొందలు ఖర్చు... ఎక్కువ డబ్బు సినిమాలకే కేటాయింపు. ఓనాడు ''రికార్డు డేంసులు'' మరోనాడు నేలవేశాలు.. బండి వేశాలు.. తొమ్మిది రోజులూ సారా సరఫరా... తొమ్మిదోనాడు పోతును బలి వేయడం... సాయంత్రం సమావేశం.. దానికి ఎదో వూరు పేరు లేని ఓ రాజకీయ నాయకుడినో ఓ సినీ యాక్టర్‌నో తెచ్చి సన్మానించడానికి యువకులు నిర్ణయించారు... ఖర్చు సుమారు ఐదారు వేలదాకా ఎగబాకింది.. .. అంతే బాగుంది.. చీకట్లో మగ్గుతున్న ఈ పల్లె ఆ తొమ్మిది రోజులూ కళ కళ లాడుతుంది పైడమ్మ పుణ్యామా అంటు. పొలాల్లో యిండల్లో ఏమీ తెలియక వుండిపోయే ఆడ వాళ్ళకు ఓ వ్యాపకం.. సరదా.. నులక మంచాలలో కునికి పాట్లు పడుతున్న పెద్ద వారికో సందడి.. .. ఒకొక్కడూ ఓ ''హీరో''గా చలామణవ్వుతున్న యువకులకు తమ తెలివి తేటలు.. కండ బలం చూపడానికో అవకాశం.. ఏమీ తోచక చదువు సంధ్యలేక అల్లరి చేస్తూ పేడ ఏరుకుంటూ తిరుగుతున్న చిన్న పిల్లలకు మరింత గోల చేయడానికో సమయం........ లేకపోతే చీకటి పడ గానే కీచురాళ్ళ చప్పుడు ... అప్పుడప్పుడు ఆకలితో ఏడ్చే దూడల సవ్వడి.. రాత్రి పూట గనుక ఆ వూరు మీదుగా కారు పోతే కసిగా.. వేతగాని తనంతో కూడిన పుడుకమోతు తనంతో అరచి కొంత దూరం కారు వెనుక పరుగెట్టే కుక్కలు తప్ప వడి చప్పుడుండదా పల్లెలో... సంవత్సరం పొడుగునా పండగ పూట కట్టు బెట్టిన చీరలో కులుకుతూ చెట్టు క్రింది చిన్న





దేవాలయంలో కండ్లు పెద్దవి చేసుకొని .. కన్ను పొడుచుకున్నా కనుపించని కనుచీకట్లలో నలు దెసలూ చూస్తూ ఆ పల్లె ప్రజలను కాపాడుతుంది పైడమ్మ తల్లి .. .. .. .. సాయంత్రం కాగానే తెల్లవారక ముందేనే చెంబులతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు పోయేజనం .. రోడ్డు కిరుప్రక్కలా మురుగు కాలవలు.. ఆ మురుగులో పొర్లుతూ పన్నీరు పులుముకునే పందులు.. అందులోనే దొర్లే పిల్లలు. నేల కొరిగిన శిథిల గృహాలు.. గడ్డి తాటియాకులు.. రేకుముక్కలు.. గోనె పట్టా మొదలైన వాటితో కట్టిన భవనాలు ఈగలు ముసురుతున్న చిన్న "టీ" కొట్టు .. పండి మగ్గి కుళ్ళుతున్న అరటి పండ్లు.. ఇవి ఆ పల్లె ప్రగతిని చాటే మహత్తరమైన దృశ్యాలు.. తరుచు ఆ రోడ్డు మీద వెళ్ళే నాకీ పల్లెలన్నీ చిరపరిచితాలే ... ... దండుకొని.. బిక్షమెత్తి ఎందుకు పనికిరాని అసభ్యకరమైన సినిమాలు.. రికార్డు డేంసులు చూస్తూ కల్తీసారా తాగి వుండేకన్నా ఆడబ్బే పెట్టి మురికి గుంటలను కప్పి మురుగు దొడ్లను కట్టి శుచిగా బ్రతుకులే పైడమ్మ తల్లి ప్రమేయం లేకుండానే వూరువాడా రోగం లేకుండా బాగుపడుతుందిగా అనుకున్నాను. కాని వీరికి నచ్చ చెప్పేదెవ్వరు?...... అందరికీ ఆరోగ్యాన్ని మరో పదహారు సంవత్సరాలలో (2000)లో కలుగజేస్తామని గొంతు చించుకు చెప్పతున్న ప్రభుత్వానికి యిలాంటి వూర్లు.. వాడలు.. కొన్ని పట్టణాలనబడే ప్రదేశాలు శుచికి.. శుభ్రతకు సుఖజీవనానికి చాలా చాలా దూరంగా వున్నాయని తెలియవా??... యిలా ఆలోచిస్తూ ప్రయాణం చేస్తున్న నాలో కోపం.. ఉద్రేకం కలిగాయి ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...
... ... ... ... ...

సంబరం జరుపుకుంటున్న ఆ పల్లె మీద నుంచి మరో మారు ప్రయాణం చేస్తూ రోడ్డు మీదంతా కూర్చున్న ప్రజానీకాన్ని తప్పించడానికి మరోసారి కారు ఆపుచేయాల్సి వచ్చింది. తెర మీద నగ్న నాట్యం జరుగుతోంది... అర్థం లేని పాట దానికి వంత పాడుతోంది. యువకులు కొందరు ఆడపిల్లల్ని గేలి చేసి ఏడిపిస్తున్నారు.. కొందరు ఆడపిల్లలు రుస రుసలాడుతుంటే మరి కొందరు మిస మిసలాడుతున్నారు. ఈలలు కేకలు తాగి గోలలు అన్నీ కలిసి ఓ రొద.

త్వరగా అక్కడినుంచి వెళ్ళడమే మంచిదనిపించింది నాకు ... ... ... ఒక చోట పైడమ్మ పండగ. మరో చోట మైసమ్మ సంబరం. నాగరికులు త్యాగరాజ జయంతులు అన్నమాచార్య వర్ధంతులు చేసుకుంటారు.. అది నయమే.. కొందరు సినీ యాక్టర్ల అభిమాన సంఘాలు పుట్టిన రోజు పండగలు జేస్తారు.. పొట్ట కూటికై తెరమీద ఆడే సినీ నటులు తమ వూరికి వస్తే ఓ ఘనత.. వీరికి చేసే సత్కారాలు ఒకవేళ దేవుడే దిగివస్తే కూడా చేయరేమో.. అన్ని పండగలు పబ్బాలు సరదాలు.. ప్రచారాలు జరుపుకున్నాక ముట్టూ మూసుకుంటే మిగిలేది దౌర్భాగ్యం.. దుర్భిక్షం...దరిద్రం.. ఎప్పుడూ వుండే అసంతృప్తి.. ఆకలి.. కన్నీళ్ళు.. అనుకున్నాను... బాధగా కండ్లు మూసుకున్నాను ... ... ... ... తొమ్మిదోరోజు అయిగా పోతూ వుంటే పైడిపాలెంలో దొమ్మిగా వుంది. కర్రల చప్పుళ్ళు.. ఏడ్పులు.. ఆహాకారాలు..ఆర్తనాదాలు.. వినిపిస్తున్నాయి.. పైడమ్మ తల్లి అలిగి అందరినీ ఆవహించింది కాబోలు అనుకొని అడ్డు రోడ్డు మీదుగా గతుకులలో కారు పోనిస్తూ పైడిపాలేనికి దూరంగా వెళ్ళిపోయాను ... ... ... ...

మరునాడు వార్తాపత్రికలు అచ్చవేసిన సంగతి.. .. తాగితందనాలాడుతూ పాట పాట పచ్చి ఆ పండగ సహకార సంఘం పాళ్ళు రెండు పార్టీలుగా చీలిపోయి.. ఎలికి ఎలికి జడివానైనట్లు దెబ్బలాడుకోవడం జరిగింది.. అందులో కర్ర దెబ్బలు తిన్న ఆరుగురిని ఆసుపత్రికి చేర్చారని వారి పరిస్థితేమీ బాగాలేదని.. ఈలోగా 'పయరు" తెగ పందిరంటుకుందని .. దగ్గర్లో వున్న కొన్ని కొంపలు పరశురామప్రీతి అయ్యాయని ఆ తొక్కిడి రద్దీలో ఒక పండు ముసలి.. ఓ చంటాడు చనిపోయారని రాస్తూ ఆవూరివారు జరిపిన పండగ సంబరాలలో ఏదో లోపమున్నదని అందుకే పైడమ్మతల్లి ఆవూరి వారి మీద అలిగిందని యింకా ఏమి ఉపద్రవం వస్తుందో అని జడుస్తున్నారని వ్రాశారు. అంతే గాదు అక్కడికో నాయకుడు ఆ పల్లె ప్రజలను పరామర్శించడానికి వస్తున్నాడని తెలియ జేశారు. ... ... ... ఎవ్వరికీ తెలియని పైడిపాలెం వార్తా పత్రికంలోకెక్కింది. అది పండగ ప్రభావం.. పైడమ్మతల్లి ఉద్రేకం.. .. పండగ ముగిసింది .. నరబలితో.. రక్తపాతంతో ... మరో ఏడాది వరకూ సందడుండదు.. .. పై ఏడాది.. అంతా మరచి.. పండగ జరుపుకుంటారు.. ఇలాగే.. మరి ఈ కథ ఇంతే ... ... ... ... ... ... ...
... ... ... ... ... ... ... ... ... ...

*